# మిగ్‌జాం దడ



సిద్దిపేట పత్తి మార్కెట్ యార్డులో కవర్‌పై నిలిచిన వర్షం నీరు



సిద్దిపేట పత్తి మార్కెట్‌లో తడిసిన ధాన్యాన్ని చూపుతున్న రైతు

- కొనుగోలు కేంద్రాల్లో నిదానంగా ధాన్యం సేకరణ
- ఎక్కువ శాతం ప్రైవేట్ వ్యాపారులకు విక్రయిస్తున్న అన్నదాతలు
- రెండు మూడు రోజులుగా తుఫాన్ ప్రభావం
- ఆందోళనలో కర్షకులు

## ధాన్యాన్ని విక్రయిస్తున్న రైతులు

సిద్దిపేట, డిసెంబర్ 6 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): ఉమ్మడి జిల్లాలో రెండు మూడు రోజుల నుంచి ఓ మోస్తరు వర్షాలు పడుతున్నాయి. జిల్లావ్యాప్తంగా ముసురుతో కూడిన వర్షం వల్ల రైతులు ఆందోళన చెందుతున్నారు. అకాల వర్షం, కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం సేకరణ జాప్యమవుతుండడంతో రైతులు ప్రైవేట్ వ్యాపారులకు అమ్ముకుంటున్నారు. గ్రామాల్లో ఎక్కువ శాతం రైతులు ధాన్యాన్ని వ్యాపారులకు విక్రయిస్తున్నారు. అక్టోబర్ చివరి నుంచి జిల్లాలో వరి కోతలు ప్రారంభమయ్యాయి. దాదాపు నెలన్నర రోజులు కావస్తుంది. అనుకున్న స్థాయిలో కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం సేకరణ జరగలేదు. ధాన్యం మొదటి రకానికి క్వింటాల్ రూ. 2,203, సాధారణ రకానికి క్వింటాల్ రూ. 2,183 ఉంది. ఇందుకు తక్కువ ధరకు రైతులు వ్యాపారులకు అమ్ముకోవల్సిన పరిస్థితి నెలకొంది. ప్రభుత్వ సేకరణలో జాప్యం జరుగుతుండడం కారణంగానే పెద్దఎత్తున ప్రైవేట్ వ్యాపారులకు అమ్ముకుంటున్నామని రైతులు తెలుపుతున్నారు. మరోవైపు యాసంగి సిజన్ ప్రారంభమవుతుంది. ఇప్పటికే రైతులు తుకం పోసే పనుల్లో నిమగ్నమయ్యారు. ఈ సమయంలో రైతులకు పెట్టుబడి సాయం అవసరం ఉంటుంది. ఇటు ధాన్యం డబ్బులు సరిగ్గా రాక అటు యాసంగి రైతుబంధు సాయం రాకపోవడంతో రైతులు డబ్బుల కోసం సావుకారి బాట పట్టాల్సిన పరిస్థితులు నెలకొంటున్నాయి. రెండు రోజుల కిందట మెదక్ జిల్లా వెల్దుర్తి మండలంలో ధాన్యం డబ్బులు తీసుకోవడానికి రైతులు క్యూలో చెప్పులు పెట్టారు. సిద్దిపేట జిల్లాలో 5 లక్షల మెట్రిక్ టన్నుల వరి ధాన్యం కొనుగోలు చేసే లక్ష్యం కాగా ఇప్పటి వరకు 417 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి 1,93,206 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించారు. మెదక్ జిల్లాలో 402 కేంద్రాలు ఏర్పాటు చేసి ఇప్పటి వరకు 2,89,389 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించారు. సంగారెడ్డి జిల్లాలో 198 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి ఇప్పటి వరకు 1,44,393 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించారు.

### తుఫాన్‌తో రైతుల ఆందోళన

ఉమ్మడి మెదక్ జిల్లాలో అకాల వర్షంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. కొనుగోలు కేంద్రాల్లో ఉన్న ధాన్యంతో పాటు రైతుల కల్లాల వద్ద ఉన్న ధాన్యం తడుస్తుండడంతో రైతులు దిగాలు చెందుతున్నారు. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం సేకరణ ఆలస్యం కావడంతో రైతులు ప్రైవేట్ వ్యాపారులకు అమ్ముకుంటున్నారు. వానకాలంలో ధాన్యాన్ని ఎక్కువ శాతం ప్రైవేట్ వ్యాపారులకు విక్రయించినట్లు ఆయా గ్రామాల రైతులు చెబుతున్నారు. ప్రతి గ్రామంలో సరాసరి యాభైశాతానికి పైగానే వ్యాపారులకు ధాన్యాన్ని విక్రయించారు. కొనుగోలు కేంద్రాల్లో ఆలస్యం కావడం తదితర సమస్యలతో రైతులు ఎక్కువగా వ్యాపారుల వైపే మొగ్గు చూపారు. పైగా అకాల వర్షం వల్ల చాలామంది రైతులు నేరుగా మిల్లర్లకు, గ్రామాల్లోని వ్యాపారులకు అమ్ముకుంటున్నారు. క్వింటాల్‌కు రూ. 2వేల నుంచి రూ.2100 మధ్యన వ్యాపారులు ధాన్యాన్ని రైతుల వద్ద నుంచి కొనుగోలు చేస్తున్నారు. ధాన్యానికి డబ్బులు చెల్లించేందుకు రైతులకు 15 రోజుల గడువు పెడుతున్నారు. 15 రోజుల లోగా చెల్లిస్తామంటూ వ్యాపారులు రైతుల వద్ద ధాన్యాన్ని సేకరిస్తున్నారు. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం అమ్మినా అవి సమయానికి వస్తాయో? లేదో? అని ఎక్కువ మొత్తంలో రైతులు ప్రైవేట్ వ్యాపారుల వైపే మొగ్గు చూపుతున్నారు. గ్రామాల్లో చాలా వరకు రైతులు ప్రైవేట్ వ్యాపారులకు అమ్ముకున్నారు. జిల్లాలో కురుస్తున్న వర్షానికి ధాన్యంతో పాటు పత్తి చేనులు ఇతర పంటలకు నష్టం జరుగుతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు.



సిద్దిపేటలో తడిసిన ధాన్యాన్ని చూపుతున్న రైతులు

# వరినారు.. సస్యరక్షణ చర్యలు

## జాగ్రత్తలు పాటిస్తే ఆరోగ్యవంతమైన పంట



నారుమడి

- తెగుళ్ల నుంచి రక్షణకు మెళకువలు పాటించాలంటున్న వ్యవసాయాధికారులు

సిద్దిపేట అర్బన్, డిసెంబర్ 6 : రైతులు యాసంగి సాగుకు సన్నద్ధమవుతున్నారు. ప్రస్తుతం చలి తీవ్రత పెరుగుతుండడంతో వరినారు ఎదుగక పంటకు తెగుళ్లు సోకే అవకాశముంటుంది. కానీ, కొన్ని జాగ్రత్తలు పాటిస్తే ఆరోగ్యవంతమైన పంట పొందవచ్చునని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు. గత వర్షాకాల పంటలకంటే యాసంగిలో రైతులు వరిపంటను అధికంగా సాగు చేసే అవకాశమున్నందున వరి పంటలను సాగుచేసే రైతులు లైసెన్స్ కలిగిన దుకాణాల నుంచే విత్తనాలు కొనుగోలు చేయాలి. కొనుగోలు చేసిన రసీదును భద్రపర్చుకోవాలి. విత్తనాలు మొలకెత్తే సమయంలో సమస్యలు వస్తే దుకాణదారుపై చర్యలు తీసుకోచ్చు.

### నారుమడిలో రక్షణ చర్యలు..

- నారు పోసిన నాలుగైదు రోజులు తరువాత నారుమడిలో కిలో యూరియా, 2కిలోల డీఏపీ, కిలో పొటాష్‌ను చల్లాలి. చలి తీవ్రతతో నారుమడి ఎరుపు రంగులోకి మారి చనిపోతుంది. దీని నివారణకు 2గ్రాముల జింక్ సల్ఫేట్‌ను లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేయాలి.
- నారుమడిలో ఆకుపచ్చ తెగుళ్లు కనిపిస్తే కార్బండిజం 1.5 గ్రాములను లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేసుకోవాలి. మళ్లీ నాలుగైదు రోజుల వ్యవధిలో నారుమడి ఎరుపు రంగులోనే ఉంటే ఫార్ములా-4, ఫార్ములా-5ను రెండు సార్లు పిచికారీ చేయాలి. దీంతో సూక్ష్మదాతు లోపాన్ని నివారించవచ్చు.
- గడిచిన వానకాలం సీజన్ అనుభవాలను దృష్టిలో ఉంచుకుని ఈసారి వరిపై కాండం తొలుచు పురుగు ప్రభావం ఉంటుంది. కాబట్టి నారుమడి వేసిన 15 రోజులకోసారి కిలో కార్బోఫ్యూరాన్ 3జీ గుళికలను చల్లాలి. రెండో విడుతగా నాటువేసే వారం ముందు మరోసారి చల్లాలి.

### సేంద్రియ పద్ధతిలో విత్తన శుద్ధి..

- ఐదు గ్రాముల సూడోమోనాస్ పొడిని కిలో విత్తనానికి ఒక లీటర్ నీటిచొప్పున కలుపుతూ 30 కిలోల విత్తనానికి సరిపడే ద్రావణాన్ని తయారు చేయాలి. ఈ ద్రావణంలో విత్తనాలను 12 నుంచి 24 గంటలపాటు నానబెట్టాలి.
- ఒకవేళ కొత్త విత్తనాలు వేయదలిస్తే మొలకశాతం పెరగడానికి నత్రికామ్లం 30 మిల్లీ లీటర్లను 50 లీటర్ల నీటిలో కలిపి 12గంటలు నానబెట్టాలి.
- ఈ సీజన్‌లో చలి తీవ్రత అధికంగా ఉంటుంది. కాబట్టి మామూలు విధానం కంటే పొలంలో 10 సెంటిమీటర్ల ఎత్తులో బెడ్డును ఏర్పాటు చేసి నారు పోయాలి. దీంతో చలి నుంచి కొంత మేర రక్షించవచ్చు.

### జాగ్రత్తలు పాటించాలి..



యాసంగిలో ముఖ్యంగా వరినార్లు పోసుకునే రైతులు చలి తీవ్రత ఎక్కువగా ఉన్నందున ముందుగా వ్యవసాయాధికారులను ఆశ్రయించి సరైన జాగ్రత్తలు పాటించాలి. మొలకెత్తే దశలోనే తెగుళ్లు సోకే అవకాశమున్నందున రైతులు ముందస్తుగా జాగ్రత్తలు తీసుకోవాలి. యాసంగిలో రైతులు వరిపంటను అధికంగా సాగు చేసే అవకాశమున్నందున వరి పంటలను సాగుచేసే రైతులు లైసెన్స్ కలిగిన దుకాణాల నుంచే విత్తనాలు కొనుగోలు చేయాలి. కొనుగోలు చేసిన రసీదును భద్రపర్చుకోవాలి.

– వెంకట రమణి, ఏవో, నారాయణరావుపేట

### రసాయనాలతో విత్తన శుద్ధి..

- తడి పద్ధతి విధానంలో లీటర్ నీటికి 1.5 గ్రాముల కార్బండిజం పొడిని కలిపి 30 కేజీలకు సరిపడే ద్రావణాన్ని తయారు చేయాలి. ఈ ద్రావణంలో 12 నుంచి 24 గంటల వరకు విత్తనాలను నానబెట్టాలి.
- పొడి విధానంలో 3 గ్రాముల కార్బండిజం పొడిని కిలో విత్తనానికి బాగా పట్టించాలి.

### నాటువేసే సమయంలో..

- 25 నుంచి 30రోజుల నారును మాత్రమే నాటుకోవాలి.
- నాటువేసే సమయంలో నారు చివరి ఆకులను తుంచి నాటితే మంచిది.
- నాటువేసే ముందు క్లోరోపైరిపాస్ 2.5మి.లీ మందును లీటర్ నీటికి కలిపి 50లీటర్ల ద్రావణాన్ని తయారు చేయాలి. ఈ ద్రావణంలో నారును నానబెట్టి నాటుకోవాలి. దీంతో రసం పీల్చే పురుగులను అరికట్టవచ్చు.

### చలినుంచి కాపాడేందుకు..

- రాత్రి వేళల్లో నారుమడిలో నీటిని తీసి వేసి ఉదయాన్నే వెచ్చని బోరునీటిని పెట్టాలి.
- ఎత్తైన నారుమడిపైనే నారును పెంచాలి..
- మంచు ప్రభావంతో నారుమడి చనిపోతుంది. కాబట్టి, నారుమడి చుట్టూ కొంత ఎత్తులో కట్టెలను కట్టి వాటిపై పాతబట్టలను కానీ, పాలిథిన్ కవర్లను కానీ కప్పాలి.
- సూక్ష్మ పోషకాల నివారణకు జింకు సల్ఫేట్ ఫార్ములా 4, 5లను పిచికారీ చేసుకోవాలి. పై జాగ్రత్తలు పాటిస్తే ఆరోగ్యకరమైన నారుమడితో అధిక దిగుబడి పొందవచ్చు.



నారుమడిలో ఎరువు చల్లుతున్న రైతు





# కళ్యాణం.. వైభోగం

# ఆనంద రాగాల శుభయోగం

- పెండ్లి ముహూర్తాలు షురూ..
- ఆరు నెలల పాటు ఇక వెడ్డింగ్ సీజనే..
- పెండ్లిబాజాల నుంచి ఫొటో షూట్ వరకు ఊరూరా సందడే సందడి
- డెకరేషన్, క్యాటరింగ్, వాద్య బృందం, ఫొటో, వీడియోగ్రాఫర్లకు ఫుల్ డిమాండ్



సిద్దిపేట రూరల్, డిసెంబర్ 6: పెండ్లంటే నూరేళ్ల పంట. ప్రతి వ్యక్తి జీవితంలో మరుపురాని మధుర ఘట్టం. లైఫ్ పార్ట్‌నర్‌తో కొత్త జీవితానికి నాంది పలికే శుభదినం. మరి ఆ ముచ్చట సాదాసీదాగా జరిగిపోతే ఎలా.. వివాహ వేడుకల్లో ఆనందకరంగా సాగే ప్రతి తంతూ జీవితాంతం మధర జ్ఞాపకంగా మిగిలిపోవాల్సిందే. కాస్త వెలుగు.. జిలుగులు అద్దాల్సిందే. పెండ్లంటే తాలిబొట్లు, తలంబ్రాలు, పూల దండలు, ఆభరణాలు, వేదమంత్రాలు, సన్నాయిమేళాలు, షడ్రుచుల భోజనాలే కాదు. ఇప్పుడు వెడ్డింగ్‌కు సినిమా షూటింగంత వైభవం వచ్చిందంటే ఆశ్చర్యమేమీ లేదు. ప్రతి తంతు ఇక కళాత్మకంగా మారింది. ఫొటో, వీడియో షూట్లకు అమాంతం ప్రాధాన్యం పెరిగింది. బుధవారం నుంచి పెండ్లి ముహూర్తాలు ప్రారంభమయ్యాయి. మే వరకు పెండ్లిండ్ల సీజన్ ఉంటుంది. ఈ నేపథ్యంలో ఫొటో, వీడియో గ్రాఫర్లు, పురోహితులు, కేటరింగ్ నిర్వాహకులు, సన్నాయి మేళ బృందాలకు డిమాండ్ పెరగనున్నది.

### ఎన్నో హంగులు..

- వధూవరుల మంగళస్నానాలకు చేసే డెకరేషనే ప్రస్తుతం చిన్నసైజ్ పెండ్లి వేడుకలను తలపిస్తున్నాయి. పసుపు నీళ్లు వేసేందుకు అందాల జల్లెడ, సప్తవర్ణ శోభితమైన బిందెలు, మహారాజుల వైభవాన్ని గుర్తుకుతెచ్చే కంచుపాత్రలు, వాటిలో పన్నీరు కలిపిన నీళ్లు.. అందులో తేలియాడే రంగు రంగుల పూలు వన్నెలద్దుతున్నాయి.
- బాసికాలు, పెండ్లి కుమారుడికి అలంకరించే మహరాజా తలపాగాలు, సంప్రదాయ టోపీలు, కాళ్లకు తొడిగే పాంకోళ్లు. రోళ్లు, రోకళ్లకు రకరకాల రంగులతో ముస్తాబు, పెండ్లి కుమార్తెకు కొత్త అందాన్ని తెచ్చి అలంకరించే పూలజడలు, ఖరీదైన జాకెట్లు చేతులకు కళాత్మక మెహందీలు, అందమైన మేకప్, పెండ్లికుమార్తెను తీసుకువెళ్లే బుట్ట, గొడుగు.. ఇలా వివాహ వేడుకలో ఎన్నో నూతన ఆకర్షణలు బంధుమిత్రులను కట్టిపడేస్తున్నాయి. శాస్త్ర సమ్మతం కాదా.. అవునా.. అనే విషయాన్ని పక్కనపెడితే వివాహ సమయంలో వధూవరుల మధ్య ఏర్పాటు చేసే తెరను సైతం అందంగా తీర్చిదిద్దుతున్నారు ఈవెంట్ మేనేజర్స్. వాటిపై సీతారాములు లేదా, అలివేలు మంగ సమేత వేంకటేశ్వరస్వామి వంటి చిత్రాలను ప్రదర్శిస్తున్నారు. వాటిపై దేవతలను లేసు దారాల అల్లికలతో తీర్చిదిద్దుతుండడం విశేషం. వాటి వల్ల వివాహ సమయానికి దైవానుగ్రహం ప్రసరిస్తుందనే భావన కలిగిస్తున్నారు.
- వివాహ సమయంలో వధూవరుల చేతుల్లో పెట్టే కొబ్బరిబొండాలకు ముత్యాలు, పగడాలు, కెంపులతో కొత్త ఆకర్షణలు తీసుకువస్తున్నారు. వేడుకల్లో ఇప్పుడు సంప్రదాయ కర్పూర దండలు కొత్త రూపాల్లో కనువిందు చేస్తున్నాయి.
- తలంబ్రాలకు వాడే కొబ్బరి కురిడీలను సైతం నిర్వాహకులు అద్భుతంగా ముస్తాబు చేస్తున్నారు. ఇక పెండ్లి మండపం ముస్తాబైతే చెప్పనక్కర్లేదు. ఈవెంట్ మేనేజర్స్ మండపం కోసం పూలను హైదరాబాద్, బెంగళూరు నగరాల నుంచి పెద్ద ఎత్తున తెప్పిస్తున్నారు. కండ్లు మిరిమిట్లు గొలిపే లైటింగ్ సమకూరుస్తున్నారు.











### ఫొటోషూట్లకు మంచి డిమాండ్



పెండ్లికుమార్తెల ముస్తాబు నుంచి కార్ల డెకరేషన్ వరకు వేడుకల్లో మార్పు వచ్చింది. ఫొటో షూట్లకు గతంలో కంటే డిమాండ్ పెరిగింది. ఇప్పుడు వధూవరుల అలంకరణ పెద్ద ఫ్యాషన్. మంగళ స్నానం, పెండ్లితంతులకు సినిమా స్టైల్లో ఫొటోషూట్స్ జరుగుతున్నాయి. పెండ్లి కుదిరి శుభలేఖ ప్రింట్ అయిన నాటి నుంచి వివాహ వేడుక ముగిసేవరకు ఫొటో, వీడియోగ్రాఫర్లకు పని దొరుకుతున్నది.

– గాంతుల శ్రీనివాస్‌యాదవ్, ఫొటోగ్రాఫర్, సిద్దిపేట